న్యూస్‌రీల్

మూడో విడత ఐటీఐ ప్రవేశాల కౌన్సెలింగ్‌కు దరఖాస్తుల ఆహ్వానం



ఎచ్చెర్ల క్యాంపస్: జిల్లాలోని మూడు ప్రభుత్వ, 20 ప్రైవేట్ ఐటీఐ కాలేజీల్లో ఖాళీ సీట్లలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ప్రవేశాల కన్వీనర్, ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర్‌రావు తెలిపారు. కళాశాలలో మంగళవారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 27వ తేదీ లోపు ఐటీఐ.ఏపీ.జీవోవీ.ఐఎన్‌వెబ్ సైట్‌లో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. రిజిస్ట్రేషన్ అనంతరం డౌన్‌లోడ్ చేసిన దరఖాస్తు, ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలతో ప్రభుత్వ ఐటీఐల్లో నిర్వహించే పరిశీలనకు హాజరు కావాలని సూచించారు. 28వ తేదీలోపు వెరిఫికేషన్ పూర్తిచేయాలని అన్నారు. 30వ తేదీన ప్రభుత్వ ప్రభుత్వ ఐటీఐల్లో, 31వ తేదీన ప్రైవేట్ ఐటీఐల్లో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ఉంటుందని చెప్పారు.

ఆధార్ అనుసంధానంతోనే ఉపాధి వేతనాలు



సమావేశంలో మాట్లాడుతున్న డ్వామా పీడీ చిట్టిరాజు

కవిటి: జిల్లాలోని వివిధ మండలాల్లోని వేతనదారులకు ఆధార్ కార్డు అనుసంధానించిన బ్యాంకు ఖాతాకే వేతనాల చెల్లింపులు చేస్తామని డ్వామా పీడీ కె.చిట్టిరాజు అన్నారు. ఆయన మంగళవారం కవిటి ఉపాధిహామీ కార్యాలయంలో కవిటి, కంచిలి మండలాల ఉపాధి హామీ పథకం అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని ఆయా మండలాల్లో 3,22,464 మంది వేతనదారులకు గానూ 97 శాతం ఆధార్ కార్డు, బ్యాంక్‌ఖాతా అనుసంధాన ప్రక్రియ పూర్తిచేశామన్నారు. మండలాల్లో ఎవెన్యూ ప్లాంటేషన్, హార్టీకల్చర్ ప్లాంటేషన్‌ను వేగవంతం చేయాన్నారు. వీటికి సంబంధించి వార్డ్‌అండ్‌వాచ్ సిబ్బంది గుర్తింపు వేగవంతం చేయాలన్నారు. ఎస్సీ,ఎస్టీ వేతనదారుల కుటుంబాలకు 100 రోజుల పని సెప్టెంబర్ నెలాఖరు నాటికి చేరుకోవాలన్నారు. ఫిబ్రవరి నెలాఖరు నాటికి ప్రతి వేతనదారుడూ రూ.260 వేతనం పొందేవిధంగా తీర్చిదిద్దాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఏపీడీ అమ్మినాయుడు, ఎంపీడీఓ పి సూర్యనారాయణ, ఉపాధి సిబ్బంది భాస్కరరావు, పెట్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలికపై లైంగిక వేధింపుల కేసులో 20 ఏళ్ల జైలు శిక్ష



శ్రీకాకుళం పాతబస్టాండ్: పన్నెండేళ్ల బాలికపై లైంగిక వేధింపులకు పాల్పడినందుకు దోషికి 20 ఏళ్ల జైలు శిక్షను విధిస్తూ మొదటి అదనపు జిల్లా సెషన్స్ కోర్ట్ మంగళవారం తీర్పునిచ్చింది. వివరాల్లోకి వెళితే.. జలుమూరు మండలం, గుగ్గిలి పంచాయతీ, గుండువలస గ్రామంలో 2021 జూన్ 5న మైనర్‌ను అదే గ్రామానికి చెందిన కూర్మాన సింహాచలం బలవంతంగా ఎత్తుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీంతో ఆమెకు రక్తస్రావమైంది. తల్లిదండ్రులు విష యం తెలుసుకుని జలుమూరు పోలీస్‌స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, బాలికకు శ్రీకాకుళం రిమ్స్‌లో వైద్య పరీక్షలు చేయించారు. దిశ పోలీస్‌స్టేషన్ డీఎస్పీ ఎస్.వాసుదేవ్ ఈ కేసును దర్యాప్తు చేసి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు. వాదోపవాదాలు పూర్తయ్యాక నేరం రుజువు కావడంతో సింహాచలంకు 20 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ.6వేల జరిమానా విధించారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ పైడి రమణ మూర్తి వాదించారు.

● సరికొత్త శకానికి ప్రారంభం

ఏళ్లకు ఏళ్లు పాలించిన పచ్చ నాయకులు ప్రజల చేత కన్నీరు పెట్టించడమే తప్ప వాటిని తుడిచే ప్రయత్నం ఏనాడూ చెయ్యలేదు. ఓ గ్రామంలో పీహెచ్‌సీ పాడైపోతే దశాబ్దాలు వదిలేశారు గానీ..ఆ సమస్యను పరిష్కరించలేదు. మరోచోట వంతెన లేక జనం నరక యాతన పడుతుంటే కాలయాపన చేశారు తప్ప కనికరించలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆ పనులు పూర్తయ్యాయి. వెంకటాపురం పీహెచ్‌సీ, కొరసవాడ–రొమదల వంతెనలు మంగళవారం ప్రారంభానికి నోచుకున్నాయి. సంక్షేమంతోపాటు అభివృద్ధి కూడా ఊరూరా జరుగుతుందని చెప్పడానికి ఇవి సాక్ష్యాలుగా నిలిచాయి. –ఎల్.ఎన్.పేట, పాతపట్నం, వజ్రపుకొత్తూరు





నూతనంగా నిర్మించిన బ్రిడ్జి (ఇన్‌సెట్‌లో) వంతెనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

నిర్మాణం ఏమిటి	కొరసవాడ–రొమదల వంతెన
వ్యయం ఎంత	రూ.6.95 కోట్లు
వాటి ఉపయోగం	27 గ్రామాల ప్రజల రాకపోకలకు ఉపయోగపడుతుంది.
ఎన్ని రోజుల్లో పూర్తి చేశారు	ఏడాదిలో..

ఇక్కడే నది దాటి వెళ్తూ ఎందరో మృతి చెందారు. రైతుల అవసరాలకు ప్రాణాలకు తెగించి నది దాటాల్సి వచ్చేది. దీనిపై సీఎంకు విన్నవించగానే బ్రిడ్జి నిర్మాణానికి రూ.6.95 కోట్లు, రోడ్డు నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేశారు. కానీ ఎంపీ రామ్మోహన్ నాయుడు మాత్రం పార్లమెంట్ నుంచి నిధులు తీసుకువచ్చామని అబద్ధాలు చెబుతున్నారు. ఆ పార్టీ అధ్యక్షుడి నుంచి స్థానిక నాయకుడి వరకు అందరిదీ అబద్ధపు రాజకీయాలే. వారికి ప్రజలే బుద్ధి చెప్పాలి. – రెడ్డి శాంతి, పాతపట్నం ఎమ్మెల్యే





కొత్తగా నిర్మించిన వెంకటాపురం పీహెచ్‌సీ (ఇన్‌సెట్లో) పీహెచ్‌సీ ప్రారంభిస్తున్న మంత్రి సీదిరి అప్పలరాజు

నిర్మాణం ఏమిటి	వెంకటాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం
వ్యయం ఎంత	రూ.1.78కోట్లు
వాటి ఉపయోగం	ఆంధ్రాతో పాటు సరిహద్దులోని ఒడిశా పల్లెలకు వైద్యం అందిస్తుంది.
ఎన్ని రోజుల్లో పూర్తి చేశారు	ఏడాదిలో..



వెంకటాపురంలో రూ.27 లక్షలతో నిర్మించిన ఆర్‌బీకే

వెంకటాపురంలో కొత్త పీహెచ్‌సీ నిర్మించాలని ఎప్పటి నుంచో స్థానికులు కోరుతున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఇది పూర్తయ్యింది. 14 ఏళ్ల సీఎంగా చేసిన చంద్రబాబు రాష్ట్రాన్ని దివాళా తీయించడం తప్ప చేసిందేమీ లేదు. ఆ పార్టీ నాయకులకు సొంత ఆస్తులు, ధనం కూడబెట్టడం తప్ప ప్రజలకు మంచి చెయ్యడం తెలీదు. వజ్రపుకొత్తూరు మండలంలో కొత్త రోడ్లను వీలైనంత తొందరగా పూర్తి చేసి ప్రతిపక్ష నాయకులను ఇదే రోడ్డుపై నడిపిద్దాం. – సీదిరి అప్పలరాజు, మంత్రి

సుపరిపాలనకు కేరాఫ్ ఆంధ్రప్రదేశ్







మాట్లాడుతున్న ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

- ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు
- జీఆర్‌ఏయూలో 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అంశంపై సదస్సు



హాజరైన మేధావులు, విద్యార్థులు

ఎచ్చెర్ల క్యాంపస్: ఆంధ్రప్రదేశ్‌లో సుపరిపాలన సాగుతోందని సి.రాఘవాచారి ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో అవర్ స్టేట్ అవర్ లీడర్ వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో 'సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం' అన్న అంశంపై మేధావుల సదస్సు మంగళవారం నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరై ఆయన మాట్లాడుతూ గతంలో పౌర సేవల కోసం జనం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగేవారని, ఇప్పుడు సచివాలయ వ్యవస్థతో ఆ అవస్థ తప్పిందన్నారు. వృద్ధులకు పింఛన్లు, రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందుతున్నాయని గుర్తు చేశారు. గతంలో జన్మభూమి కమిటీలు వేధించేవారని, ఇప్పుడు వలంటీర్లు ఇంటింటికీ చక్కగా సేవలు అందిస్తున్నారని తెలిపారు. తండ్రి వైఎస్సార్‌ను మించి తనయుడు వైఎస్ జగన్ మంచి చేస్తున్నారని, ప్రతిపక్షాలు మాత్రం పాలనపై బురద జల్లుతున్నాయని అన్నారు. ఏడాదికి రూ. 45 వేల కోట్ల సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందజేస్తూ ఉంటే, టీడీపీ మాత్రం ఏడాదికి రూ.1.50 లక్షల కోట్ల ప్రభుత్వ పథకాలు ఇస్తామంటూ మేనిఫెస్టోలో పెట్టిందని గుర్తు చేశారు. శ్రీకాకుళం జిల్లాలో కిడ్నీ పరిశోధన కేంద్రం, ఆస్పత్రులు, పోర్టులు, పరిశ్రమలు వంటివి ఏర్పాటు చేశారని తెలిపారు.



ప్రజల ఆకాంక్షలకు తగ్గ పాలన

రాష్ట్రంలో ప్రజల ఆకాంక్షలకు తగ్గపాలన సాగుతోంది. విశాఖకు పాలనా రాజధాని అవసరం. ఈ ప్రాంత ప్రజలు విశాఖకు రాజధాని రావడాన్ని వ్యతిరేకిస్తున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. గ్రామా ల్లో సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటుతో ప్రజలకు ప్రత్యక్ష సేవలు అందుతున్నాయి – ప్రొఫెసర్ బాలమోహన్ దాస్, పూర్వపు వైస్ చాన్స్‌లర్, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, సదస్సు అధ్యక్షుడు

ప్రజలు సంతోషంగా ఉన్నారు



రాష్ట్రంలో ప్రజలు సంతోషంగా ఉన్నారు. విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ అందుతోంది. సమాజ ప్రగతికి ప్రభుత్వ పథకాలు దోహద పడుతున్నాయి. – ప్రొఫెసర్ తిమ్మారెడ్డి, విశ్రాంత ప్రొఫెసర్, ఆంధ్రా విశ్వవిద్యాలయం.

విప్లవాత్మక మార్పులు



రాష్ట్రంలో విద్యలో విప్లవాత్మక మార్పులు అమలవుతున్నాయి. అమ్మఒడి ప్రభుత్వ,ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు సైతం అందజేయటం సీఎం గొప్ప మనసుకు నిదర్శనం. విద్యతోనే పేదరిక నిర్మూలన, ఆదర్శ సమాజం స్థాపన సాధ్యం. – ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు, వీసీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

గ్రామాలు మారాయి



గ్రామాల్లో గుడ్ గవర్నెన్స్ అంటే ఏమిటో సీఎం వైఎస్ జగన్ చేసి చూపించారు. మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాకారమైంది. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలు చేరుతున్నాయి. – పొన్నాడ వెంకటరమణ, న్యాయవాది

లైఫ్ స్కిల్స్ మెరుగు పడుతున్నాయి



జిల్లాలో ఆస్పత్రులు, కాలేజీలు పెరిగాయి. విద్యలో నైపుణ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోంది. ఇంటర్న్‌షిప్, అప్రెంటిస్ షిప్, సామాజిక అనుసంధాన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. – డాక్టర్ ఎస్.ఉదయ్‌భాస్కర్, ప్రిన్సిపాల్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

ఆదర్శ పాలన అందిస్తున్నారు



సీఎం వైఎస్ జగన్ ఆదర్శ పాలన సాగిస్తున్నారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు ప్రజల సమస్యలు తెలుసుకుని అధికారంలోకి వచ్చాక వాటిని పరిష్కరిస్తున్నారు. అర్హత ఆధారంగా ప్రభుత్వ పథకాలు ఇంటికి చేర్చుతున్నారు. – బి.రాజేష్, బీసీ సంఘ నాయకులు

మహిళలకు ఆర్థిక ప్రగతి



ప్రభుత్వం మహిళలను ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తోంది. పథకాలను వారి పేరు మీదుగానే ఇస్తోంది. దీంతో మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధిస్తున్నారు. – డాక్టర్ ఎం.అనురాధ, సోషల్ వర్క్ అసిస్టెంట్ ప్రొఫెసర్

విద్యలో సమూల మార్పులు



ఉన్నత విద్యలో సమూల మార్పులకు సీఎం వైఎస్ జగన్ శ్రీకారం చుట్టారు. అర్హులందరికీ జగనన్నవిద్యా దీవెన, జగనన్న వసతి దీవెన అందజేస్తున్నారు. జగనన్న విదేశీ విద్యా దీవెన వల్ల పేద విద్యార్థులు విదేశాల్లో టాప్ విశ్వవిద్యాలయాల్లో చదువుతున్నారు. – ప్రొఫెసర్ సి.హెచ్.ఎ. రాజేంద్రప్రసాద్, రిజస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

సీఎంది ముందు చూపు



సీఎం వైఎస్ జగన్ ఎంతో ముందుచూపుతో వ్యవహరిస్తున్నారు. సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ గ్రామ స్థాయిలో ప్రజల వద్దకు పాలన అందిస్తున్నారు. నవరత్నాలు దేశం మొత్తాన్ని ఆకర్షించాయి. – జి.శాంతమూర్తి, ఫౌండర్ సెక్రటరీ, అవర్ స్టేట్ అవర్ లీడర్ వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం

పేదల బతుకుల్లో మార్పులు



ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా పథకాలను ప్రభుత్వం అందిస్తోంది. దీంతో పేదల బతుకుల్లో మార్పులు వస్తున్నాయి. సామాజిక ఆర్థిక పరిస్థితి మెరుగు పడింది. – ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం.

స్వపరిపాలన అమలు చేశారు



రాష్ట్రంలో స్థానిక స్వపరిపాలన అమలు చేశారు. ప్రజల వద్దకు ప్రభుత్వ కార్యాలయాలు వచ్చాయి. గ్రామం యూనిట్‌గా స్పష్టమైన ప్రగతి కనిపిస్తోంది. ప్రభుత్వ విద్యార్థులు ప్రైవేటు వారితో దీటుగా ప్రగతి సాధిస్తున్నారు. – ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు, విశ్రాంత ప్రొఫెసర్, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయం

వలంటీర్‌కు చెబితే చాలు..



గతంలో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం పాట్లు పడేవాళ్లం. ఇప్పుడు వలంటీర్‌కు చెబితే చాలు ఇంటికే తెచ్చి ఇస్తున్నారు. ప్రజల అవసరాలకు తగ్గట్టు పాలిస్తున్నారు. – రంజిని, ఇంజినీరింగ్ విద్యార్థిని

జీవన ప్రమాణాల్లో మార్పులు



అర్హులందరికీ గ్రామ సచివాలయం యూనిట్‌గా ప్రభుత్వ పథకాలు అందుతున్నాయి. దీంతో ప్రజలు జీవన ప్రమాణాల్లో మార్పు వస్తోంది. – పావని, ఇంజినీరింగ్ విద్యార్థి

అక్రమాల డొంక కదులుతోంది



- మార్కెట్ కమిటీ నిధులు పక్కదారిపై సీరియస్
- మరో ముగ్గురి సస్పెన్షన్
- ఇప్పటికే కీలక పాత్రధారి సెక్రటరీ చిన్నికృష్ణ సస్పెన్షన్
- రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్న మార్కెటింగ్ శాఖ

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం: మార్కెటింగ్ శాఖలో తీగ లాగితే డొంక కదిలింది. ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీల్లో నిధులు పక్కదారి పట్టించిన సెక్రటరీ చిన్నికృష్ణ వ్యవహారం లోతుగా పరిశీలించే కొద్దీ మరికొందరి అక్రమాల చిట్టా బయటపడింది. గతంలో ఇక్కడ పనిచేసి, ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న మరో ముగ్గురి ప్రమేయం ఉన్నట్టు తేలింది. అందులో భాగంగా వారిని కూడా సస్పెండ్ చేస్తూ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరితోనే వదిలేసే పరిస్థితి కనబడటం లేదు. ఇందులో మరికొందరి జోక్యం ఉండవచ్చనే అనుమానంతో మరింత సమగ్ర విచారణ జరుపుతున్నారు. జిల్లాలో జరిగిన నిధుల పక్కదారి ఘటనతో మార్కెటింగ్ శాఖ రాష్ట్ర వ్యాప్తంగా అప్రమత్తమైంది.

ఈ తరహాలో ఇంకా ఎక్కడైనా...

ఎవరూ ఊహించని విధంగా ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీల్లో సెక్రటరీగా పనిచేసిన చిన్ని కృష్ణ అక్రమాలకు పాల్పడినట్టుగా మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు.

- ఇదే తరహాలో మిగతా చోట్ల జరిగిందా అనే కోణంలో లోతుగా పరిశీలన జరుపుతున్నారు.
- ఇప్పటికే రాష్ట్రంలోని మార్కెట్ కమిటీలన్నింటికీ ప్రత్యేక ఆదేశాలు ఇచ్చారు. మార్కెట్ కమిటీ ఖాతాల నుంచి నిధులు వినియోగం చేపట్టవద్దని, ప్రత్యేక పరిస్థితులుంటే తమ దృష్టికి తీసుకొచ్చి తదుపరి చర్యలు తీసుకోవాలని స్పష్టమైన ఉత్తర్వులిచ్చింది.
- అంతేకాకుండా పీడీ అకౌంట్, కరెంట్ అకౌంట్‌లను ఓపెనింగ్ బ్యాలెన్స్ ఎంత? క్లోజింగ్ బేలన్స్ ఎంత? రశీదులు ఎంత? ఇలాంటి వివరాలతో రికార్డులన్నీ ఉన్నతాధికారులు అడుగుతున్నారు. వాటిని పరిశీలించే పనిలో నిమగ్నమయ్యారు.
- జిల్లాలో చోటు చేసుకున్న పరిణామం నేపథ్యంలో రీజినల్ వారీగా మార్కెటింగ్ కమిషనర్ రాహుల్ పాండే ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించి తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు.
- ఇప్పటికే విశాఖ రీజియన్‌లో సమావేశం జరిగింది. బుధవారం విజయవాడలో జరగనుంది. తదుపరి రాయలసీమ, మిగతా రీజియన్‌లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి, మార్కెట్ కమిటీ లావాదేవీలు, కార్యకలాపాలపై సమీక్ష చేయనున్నారు.

మరి కొందరి పాత్రపై అనుమానాలు..

ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీల్లో దాదాపు రూ.3.20కోట్లకు పైగా నిధులు దారి మళ్లించిన సెక్రటరీ చిన్నికృష్ణను ఇప్పటికే సస్పెండ్ చేయగా, తాజాగా మరో ముగ్గురిని సస్పెండ్ చేస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యంగా చిన్నికృష్ణ చాలా తెలివిగా నిధులు దుర్వినియోగం చేసినట్టు తెలిసింది. సీఎఫ్‌ఎంఎస్ ద్వారా బిల్లులు పెట్టి పీడీ అకౌంట్ నుంచి కరెంట్ అకౌంట్‌కు, అక్కడి నుంచి పలువురి వ్యక్తిగత ఖాతాలకు నిధులు మళ్లించారు. ముఖ్యంగా తనకు సంబంధించి ఓ చారిటబుల్ ట్రస్టుకు రూ.40లక్షలకు పైగా మళ్లించారు. అలాగే, పలువురు ప్రైవేటు వ్యక్తులకు, తన వద్ద పనిచేసిన సిబ్బంది పేరున చెక్‌లు రాసి, వాటి ద్వారా నిధులు డ్రా చేయించారు. గతంలో ఎచ్చెర్ల, ఇచ్ఛాపురం మార్కెట్ కమిటీల్లో పనిచేసి ప్రస్తుతం నరసన్నపేట, కోటబొమ్మాళి, ఎచ్చెర్లలో పనిచేస్తున్న సూపర్‌వైజర్లు కె.రామారావు, కె.మురళీకృష్ణ, సెక్యూరిటీ గార్డు ఉమామహేశ్వరరావుల ప్రమేయాన్ని గుర్తించారు. వీరిని సెక్రటరీ భాగస్వామ్యం చేశారో లేదంటే సెక్రటరీతో వారు ఉద్దేశపూర్వకంగా కుమ్మక్కై నిధులు దారి మళ్లించారో తెలీదు గాని ఈ ముగ్గురు సిబ్బందిని బాధ్యుల్ని చేస్తూ సస్పెండ్ చేశారు. నిధుల దారి మళ్లింపుపై చర్యలు ఇక్కడితో ఆగేలా కన్పించడం లేదు. ఇందులో మరికొందరి ప్రమేయం కూడా ఉన్నట్టు అనుమానాలున్నాయి. ఆ దిశగా విచారణ జరుగుతోంది. ఇందులో తప్పు తేలితే తప్పనిసరిగా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. మరికొందరిపై వేటు పడే అవకాశం కనబడుతోంది. ఇక్కడ జరిగిన నిధుల పక్క దారి వ్యవహారాన్ని రాష్ట్ర మార్కెటింగ్ శాఖ చాలా సీరియస్‌గా తీసుకుంది. ఏకంగా ప్రక్షాళన చేయాలన్న దిశగా చర్యలు తీసుకుంటోంది.

● ఉద్దానంలో ఎలుగు భయం



మల్లేనవారిపేట ప్రాంతంలో సంచరిస్తున్న ఎలుగుబంట్లు

ఉద్దానం వాసులను ఎలుగులు భయపెడుతున్నాయి. రాత్రి వేళ గ్రామాల్లో చొరబడి, ఇళ్లల్లో దూరి దొరికినవి దొరికినట్టు తినేస్తున్నాయి. గత రెండు రోజులుగా నారాయణపురం పంచాయతీలో ఎలుగులు తోటల్లో, రహదారులపై తిరుగుతుండడంతో ఉద్దానం వాసులు ఆందోళన వ్యక్తం చే స్తున్నారు. మల్లేనవారిపేట గ్రామంలో సమీపంలో ఒకే చోట మూడు ఎలుగులు సంచరించడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. అటవీ శాఖాధికారులు స్పందించి రక్షణ కల్పించాలని కోరారు. – మందస

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం



లైఫ్ జాకెట్లు పంపిణీ చేస్తున్న మంత్రి ధర్మాన. చిత్రంలో రెడ్‌క్రాస్ ఛైర్మన్ జగన్మోహనరావు తదితరులు

శ్రీకాకుళం కల్చరల్: మత్స్యకారుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని అనురాగ నిలయంలో రెడ్‌క్రాస్ సహకారంతో 200 మంది మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాలను పణంగా పెట్టి నిత్యం సముద్రంలో వేటకు వెళ్తున్న మత్స్యకారులకు లైఫ్‌జాకెట్లు రక్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. త్వరలో సీఎం జగన్మోహన్‌రెడ్డితో సంప్రదించి మత్స్యకారులందరికీ లైఫ్‌జాకెట్లు అందజేసే కార్యక్రమం చేపడతామని ప్రకటించారు. రెడ్‌క్రాస్ ఛైర్మన్ పి.జగన్మోహనరావు మాట్లాడుతూ మగటపల్లి వెంకట రమణమూర్తి వెల్ఫేర్ అండ్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టామని తెలిపారు. అనంతరం డాక్టర్ పీఎల్ఎన్ రాజు, డాక్టర్ నిక్కు అప్పన్నలు స్పందించి రూ.10వేలు చొప్పున విరాళం ప్రకటించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు పీఎల్ఎన్ రాజు, గార మండలాధ్యక్షుడు గొండు రఘురాం, మత్స్యకార సంఘం అధ్యక్షుడు కోనాడ నరసింహారావు, రెడ్‌క్రాస్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీలో 150 మంది టీడీపీ కార్యకర్తల చేరిక



టీడీపీ కార్యకర్తలకు కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అప్పలరాజు

వజ్రపుకొత్తూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పాలనకు ఆకర్షితులై వజ్రపుకొత్తూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన 150 మంది టీడీపీ కార్యకర్తలు సర్పంచ్ కె.మల్లేశ్వరరావు, మాజీ సర్పంచ్ గండేటి జోగారావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ తీర్థం పుచ్చుకున్నారు. టీడీపీ క్రియాశీలక కార్యకర్తలు మరడ తిరుమలరెడ్డి, మరడ భానమ్మ, మరడ సీతారాం, వసంతరావు, నీలాపు సుజాత, మరడ పాపమ్మలతో పాటు 150 మందికి మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు.

దూరదర్శన్ బీ గ్రేడ్ ఆర్టిస్టులుగా శ్రీకాంత్ శిష్యులు



సర్టిఫికెట్లతో శ్రీకాంత్ శిష్యులు రామకౌండిన్య, బాలచందర్

శ్రీకాకుళం కల్చరల్: నగరానికి చెందిన సుప్రసిద్ధ నాట్య గురువు డాక్టర్ రఘుపాత్రుని శ్రీకాంత్ శిష్యులు రామకౌండిన్య, బాలచందర్‌లు ప్రతిష్టాత్మకమైన దూరదర్శన్ బీ గ్రేడ్‌ను కూచిపూడి, భరతనాట్యం విభాగంలో సాధించారు. 2013, 2014 సంవత్సరాలలో దూరదర్శన్ బీ గ్రేడ్‌కు దరఖాస్తు చేయగా దూరదర్శన్ డైరెక్టర్ రవీంద్ర రావ్ చేతుల మీదుగా సర్టిఫికెట్ పొందారు. వీరిద్దరూ శ్రీకాంత్ వద్ద 23 ఏళ్లుగా నాట్యంలో శిక్షణ పొందుతున్నారు. ఇప్పటి వరకు ఐదుగురు విద్యార్థులు మాత్రమే దూరదర్శన్‌లో గ్రేడ్‌లు సాధించగా వారంతా శివశ్రీనృత్య కళానికేతన్ సంస్థ విద్యార్థులు కావడం గమనార్హం.

జెడ్పీటీసీ ఔదార్యం



పాముకాటుకు గురైన దుర్గను ఆస్పత్రికి తీసుకెళ్లిన జెడ్పీటీసీ వసంతరెడ్డి

సంతబొమ్మాళి: స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి మానవత్వం చాటడంతో ఓ మహిళకు ప్రాణాపాయం తప్పింది. సీతానగరం గ్రామానికి చెందిన బచ్చల దుర్గ మంగళవారం పాము కాటుకు గురైంది. వెంటనే నౌపడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లడంతో సిబ్బంది ప్రథమ చికిత్స అందించారు. ఆ సమయంలో పరామర్శలకు వెళ్లి తిరిగి వస్తున్న జెడ్పీటీసీ వసంతరెడ్డికి విషయం తెలియడంతో వెంటనే స్పందించి మెరుగైన వైద్యం కోసం టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి కాకరులో వెళ్లారు. డాక్టర్‌తో మాట్లాడి వైద్యం త్వరగా ఇవ్వాలని కోరడంతో బాధితురాలకు ప్రాణాపాయం తప్పింది. సకాలంలో స్పందించిన జెడ్పీటీసీకి దుర్గ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

జిల్లా బార్ అసోసియేషన్ సమావేశం నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లా బార్ అసోసియేషన్ సమావేశం బుధవారం బార్ భవనంలో మధ్యాహ్నం 12 గంటలకు నిర్వహిస్తున్నట్టు సంఘ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, కార్యదర్శి పొన్నాడ రాము ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు క్యాంటీన్ బకాయి వసూలు, భవిష్యత్ కార్యాచరణపై చర్చిస్తామని పేర్కొన్నారు. సభ్యులంతా హాజరుకావాలని కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹210	₹ 220

సెర్ప్ ఉద్యోగులకు బాసటగా..

- 23 శాతం వేతనాలు పెంచిన ప్రభుత్వం
- జిల్లాలో సుమారు 206 మంది ఉద్యోగులకు లబ్ధి



స్వయం సహాయక సంఘాల సమావేశంలో సెర్ప్ ఉద్యోగులు

టెక్కలి: గ్రామ స్థాయిలో స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తూ మహిళలంతా స్వయం ఉపాధి మార్గాలతో ఆర్థికంగా పురోభివృద్ధి సాధించడానికి కృషి చేస్తున్న గ్రామీణ పేదరిక నిర్మూలనా సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. మూలవేతనానికి 23 శాతం అదనంగా కలిపి వేతనాలు పెంచుతూ ఇటీవల ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. దీంతో సెర్ప్ విభాగంలో పనిచేస్తున్న ఎఫ్‌టీఈలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

206 మందికి లబ్ధి..

వేతనాల పెంపుతో జిల్లాలో సెర్ప్ విభాగంలో పనిచేస్తున్న 206 మంది ఉద్యోగులకు లబ్ధి కలగనుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 49,029 స్వయం సహాయక సంఘాలు, 1295 గ్రామైక్య సంఘాల పరిధిలో సుమారు 5,60,431 మంది సభ్యులు ఉన్నారు. వైఎస్సార్ కాంతి పథం ద్వారా ఆయా సంఘాల సభ్యుల ఆర్థిక పురోభివృద్ధి కోసం జిల్లా వ్యాప్తంగా ముగ్గురు ఏరియా కోఆర్డినేటర్లు, ఐదుగురు డీపీఎంలు, 40 మంది ఏపీఎంలు, 18 మంది సహాయక సిబ్బంది, 28 మంది హెచ్‌ఆర్ సీసీలు, 112 మంది సీసీలు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో వీరందరికీ లబ్ధి కలగనుంది.

సంతోషంగా ఉంది..



సెర్ప్ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు 23 శాతం వేతనాలు పెంచడం సంతోషంగా ఉంది. మా అందరికీ లబ్ధి కలిగేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి సీఎంకు ధన్యవాదాలు.

– జి.నారాయణరావు, ఏపీఎం వైఎస్సార్ కాంతి పథం, టెక్కలి

రుణపడి ఉంటాం..



మా సేవలను గుర్తిస్తూ ప్రభుత్వం వేతనాలు పెంచడం ఆనందంగా ఉంది. మా సేవలను గుర్తించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి రుణపడి ఉంటాం. గ్రామ స్థాయిలో మహిళా సంఘాల ఆర్థిక పరిపుష్టికి మరింత కృషి చేస్తాం.

– కె.పద్మ, వైఎస్సార్ కాంతి పథం కమ్యూనిటీ కోఆర్డినేటర్, టెక్కలి మండలం

ప్రభుత్వానికి కృతజ్ఞతలు..



సెర్ప్ విభాగంలో పని చేస్తున్న ఉద్యోగుల సేవలను గుర్తిస్తూ 23 శాతం వేతనాలు పెంచిన ప్రభుత్వానికి మా ఉద్యోగుల తరఫున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాం. ప్రభుత్వ నిర్ణయంతో ఉద్యోగులంతా ఆనందంగా ఉన్నారు.

– ఎస్.శ్రీరాములు, ఏరియా కోఆర్డినేటర్, టెక్కలి

• సైకత చంద్రయాన్



'చంద్రయాన్- 3 ప్రాజెక్టు విజయవంతం కావాలి.. మువ్వన్నెల భారత పతాకం ప్రపంచంలో రెపరెపలాడాలని ఆశిద్దాం' అనే సంకేతంతో ఆమదాలవలస మండలం గాజులకొల్లివలస వద్ద సంగమేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం సైకత శిల్పి గేదెల హరికృష్ణ వేసిన సైకత శిల్పం ఆకట్టుకుంది.

– ఆమదాలవలసరూరల్

• సుబ్రహ్మణ్యస్వామి నమోస్తుతే..!



నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామికి శ్రావణ మంగళవారం సందర్భంగా విశేష పూజలు నిర్వహించారు. స్వామికి ప్రీతికరమైన రోజు కావడంతో అర్చకులు మహేష్ ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు.

– శ్రీకాకుళం కల్చరల్

మీ క్యాంపస్‌లో మీరే కాప్స్



క్యాంపస్‌కాప్స్ బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ రాధిక, పోలీసు అధికారులు

- ఎస్పీ జి.ఆర్.రాధిక

శ్రీకాకుళం క్రైమ్ :

చదువుతున్న ప్రతీ విద్యార్థి సమాజం పట్ల బాధ్యతగా ఉంటూ ఇతరుల పట్ల గౌరవభావంతో మెలగాలని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. బాధ్యత గల పౌరుడు యూనిఫామ్ లేని పోలీసేనని, మీ క్యాంపస్‌లో మీరే కాప్స్ అని పేర్కొన్నారు. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన క్యాంపస్ కాప్స్ ఫేజ్-2 అనే నూతన పోలీసింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం మంగళవారం జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ గతంలో శ్రీకాకుళం, టెక్కలిలో ప్రవేశపెట్టిన క్యాంపస్‌కాప్స్‌లో 213 మంది విద్యార్థులు శిక్షణ పొంది 780 గంటల పాటు పోలీసులతో విధి నిర్వహణలో పాల్గొని సహకారాన్ని అందించారన్నారు. మళ్లీ ఇప్పుడు జిల్లావ్యాప్తంగా అన్ని సర్కిల్ హెడ్ క్వార్టర్స్‌లో మూడురోజుల పాటు ఇవ్వనున్న శిక్షణా తరగతులలో దిశా యాప్ రిజిస్ట్రేషన్, ట్రాఫిక్ నిబంధనలు, ముఖ్యమైన చట్టాలుపై శిక్షణ ఇవ్వనున్నారని చెప్పారు. విద్యార్థి మైండ్‌లో తనతో పాటు అందరూ బాగుండాలని, అంకిత భావం, క్రమ శిక్షణలే క్యాంపస్‌కాప్స్‌కు మొదటి అర్హతని పేర్కొన్నారు. మీ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలు సమాచారాన్ని పోలీసులకు తెలిపితే మీ వివరాలు గోప్యంగా ఉంచుతారని చెప్పారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో జేడీ(ఎస్ఈబీ అదనపు ఎస్పీ) వి.నాగమణికంత మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అవగాహన కలిగివుండాలన్నారు. అదనపు ఎస్పీ (క్రైమ్) టి.పి.విఠలేశ్వరరావు మాట్లాడుతూ శిక్షణాకాలాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు ఎస్పీ (అడ్మిన్) జె.తిప్పేస్వామి మాట్లాడుతూ శిక్షణ తరగతులు క్షుణ్ణంగా అధ్యయనం చేసుకుంటే విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం క్యాంపస్ కాప్స్‌లో పాల్గొన్న పలువురు విద్యార్థులు తమ అనుభవాలు తెలియజేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు వై.శృతి, సీహెచ్‌జీవీ ప్రసాదరావు, డి.విజయ్‌కుమార్, ఒకటో, రెండో పట్టణ సీఐలు లెంక సన్యాసినాయుడు, పప్పల శ్రీనివాసరావు, డీసీఆర్బీ సీఐ దేవరపల్లి నవీన్‌కుమార్, రణస్థలం సీఐ ఆదాం, ఆమదాలవలస సీఐ పైడయ్య, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి



బూర్జ : మండలంలోని కంట్లాం పంచాయతీ లచ్చయ్యపేటకు చెందిన పిన్నింటి పోలమ్మ (57) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పోలమ్మ ఈ నెల 18న ఇంట్లో ద్వారం దాటుతుండగా మెట్ల పైనుంచి కిందపడిపోయింది. తీవ్ర గాయాలు కావడంతో 108 అంబులెన్సులో శ్రీకాకుళం రిమ్స్‌కి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మరణించింది. మంగళవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలమ్మకు భర్త వెంకటరావు, కుమారుడు జనార్దనరావు ఉన్నారు. వెంకటరావు ఫిర్యాదు మేరకు ఎస్సై బి.అశోక్‌బాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్నానానికి దిగి వృద్ధురాలి మృతి



మృతి చెందిన వరహాలు

జలుమూరు: మండలంలో శ్రీముఖలింగం గ్రామానికి చెందిన ఎస్.వరహాలు (75) వంశధార నదిలో స్నానానికి దిగి ప్రమాదవశాత్తు మంగళవారం మృతి చెందింది. అక్కడే ఉన్న స్థానికులు గుర్తించి గాలించిన ఫలితం లేకపోయింది. కొన్ని గంటల తరువాత నగిరి కటకం సమీపంలో నదిలో శవమై తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోటబొమ్మాళి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

వివాహిత ఆత్మహత్య



రాజేశ్వరి మృతదేహం

శ్రీకాకుళం రూరల్: నగర పరిధిలోని ఆదిత్యనగర్ కాలనీలో నివాసముంటున్న వి.రాజేశ్వరి (24) మంగళవారం పొన్నాడ బ్రిడ్జి పైనుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడింది. కునుకుపేట వద్ద స్థానికులు మృతదేహాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ ఎస్ఐ విజయ్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు.. రాజేశ్వరి చిన్నప్పుడే తల్లిదండ్రులు మృతిచెందడంతో సోదరుడి సమక్షంలో ఉంటోంది. ఇంటర్మీడియట్ పూర్తి చేసింది. అదే కాలనీలో నివాసముంటున్న శివను ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రేమ వివాహం చేసుకుంది. కొద్ది నెలలుగా అత్తామామల వేధింపులు ఎక్కువ కావడంతో భర్తతో కలిసి ఆదిత్యనగర్ కాలనీలోనే వేరు కాపురం పెట్టారు. ఈ నేపథ్యంలో భర్త నిత్యం తాగివచ్చి రాజేశ్వరిని కొట్టడం, వేధింపులకు గురి చేసేవాడు. మనస్తాపం చెందిన రాజేశ్వరి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో బయటకు వెళ్లి ఆత్మహత్యకు పాల్పడింది. సోదరుడు మణికంత ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గారలో డీసీసీబీ ఏటీఎం ప్రారంభం



ఏటీఎం సెంటర్‌ను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు

గార: మండల కేంద్రంలో గారలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఆధ్వర్యంలో ఏటీఎంను మంగళవారం డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏటీఎం సెంటర్‌ను ఖాతాదారులు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, డీసీసీబీ సీఈవో డి.వరప్రసాద్, జీఎం ఎస్‌వీఎస్ జగదీష్, సర్పంచ్ మార్పు పృథ్వీరాజ్, ఎంపీటీసీ ఆరంగి రమణమూర్తి, డైరెక్టర్ గొండు కృష్ణమూర్తి, పీఏసీఎస్ అధ్యక్షుడు కె.చిన్నంనాయుడు, డీసీసీబీ డీజీఎం ఎస్‌వీఎస్ సత్యనారాయణ, బసవలింగం, సీహెచ్ రామకృష్ణ, గార మేనేజర్ బి.వెంకటరమణ, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

కిడ్నీ రోగులపై ప్రత్యేక శ్రద్ధ

కాశీబుగ్గ:



పలాసలోని కిడ్నీపరిశోధన కేంద్రం వద్ద కొమ్మినేని శ్రీనివాసరావు

కిడ్నీ వ్యాధిగ్రస్తుల ఆరోగ్యం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. పలాసలో నిర్మిస్తున్న కిడ్నీ పరిశోధన కేంద్రాన్ని మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కిడ్నీ పరిశోధన కేంద్రానికి రూ.80 కోట్లు, వంశధార నుంచి పలాసకు రూ.700 కోట్లతో తాగునీరు తీసుకురావడం గొప్ప పరిణామమని పేర్కొన్నారు. ఈ ప్రాంతానికి చెందిన మంత్రి సీదిరి అప్పలరాజు స్వయంగా వైద్యులు కావడం, కిడ్నీ వ్యాధి పూర్వాపరాలు ముఖ్యమంత్రికి వివరించడంతో భవన నిర్మాణానికి అడుగులుపడ్డాయన్నారు. అనంతరం డయాలసిస్ కేంద్రాన్ని కొమ్మినేని పరిశీలించారు. వైద్యులతో మాట్లాడి సేవలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ కె.శ్రీనివాసరావు, శాంతమూర్తి, మాజీ మున్సిపల్ చైర్మన్ పూర్ణచంద్రరావు, డయాలసిస్ యూనిట్ అభివృద్ధి కమిటీ చైర్మన్ డి.భవానీశంకర్, వైద్యులు ఎస్.కూర్మారావు, కిరణ్‌కుమార్, రఘురాం, గీత, సరిత, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

జానపద కళలను కాపాడుకుందాం

శ్రీకాకుళం కల్చరల్:



జానపద కళాకారులను సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళ రంగస్థల కళాకారుల సమాఖ్య ఆధ్వర్యంలో జానపద కళాకారుల దినోత్సవం మంగళవారం సమాఖ్య కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సమాఖ్య అధ్యక్షుడు చిట్టి వెంకటరావు మాట్లాడుతూ అంతరించిపోతున్న జానపద కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. జిల్లా అధ్యక్షుడు కలగ గణేష్‌యాదవ్ మాట్లాడుతూ కళా ప్రదర్శనలకు అవకాశాలు కల్పించి కళను బతికించాలని కోరారు. అనంతరం గొర్లెపార్వతి (ఎరుకులపాట), వి.తవిటయ్య(జానపదం), బంకి కాంతారావు (చెక్కభజన), లండ వన్నారి, తాళాసు ప్రకాష్, నగిరికటకం కర్రెన్న(తప్పెటగుళ్లు), పి.రామలింగస్వామి (శివ బాగోతం), బి.జ్యోతి(బుర్రకథ)లను సత్కరించారు. పందిరిపాట కళాకారుడు బత్తిలి రామకృష్ణను సన్మానించి రూ.2800 ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో సమాఖ్య గౌరవాధ్యక్షుడు ఎల్.రామలింగస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షుడు పన్నాల నర్సింహమూర్తి, ఉపాధ్యక్షులు పొట్నూరు వెంకటరావు, నిక్కు హరిసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బి.రామచంద్రదేవ్, కోశాధికారి ఇంజరాపు రమణారావు, కంచరాన అప్పారావు, పైడి సత్యవతి, గజల్ వాసుదేవరావు, రాళో, కేఎల్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు